


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



\- 126 –

## నర్సు సుధ కథ

**అది కువైట్‌లోని అల్–సబా హాస్పిటల్**. బయట భగభగ మండే ఎండ, లోపల ఏసీ చల్లదనం ఉన్నా సుధ మనసు మాత్రం వేడిగానే ఉంది. అర్థంకాని ఆలోచనలతో అస్థిమితంగా ఉంది. ఉదయం ఆరు గంటలకే డ్యూటీ మొదలుపెట్టిందామె. ఇంకా నిద్రమత్తు వదలని కళ్ళతోనే యూనిఫాం వేసుకుంది.

అల్–సబా అంటే కువైట్‌లో పెద్ద ఆసుపత్రి. రకరకాల దేశాల వాళ్ళు, రకరకాల సంస్కృతులు, భాషల వాళ్ళు ఆసుపత్రిలో వుంటారు. మహిళా నర్సులకు ముఖ్యంగా స్త్రీల వార్డులోనే డ్యూటీ వుంటుంది.

అరబిక్ మాటలు, బురఖాల వెనక మెరిసే కళ్ళు, ముభావంగా ఉండే వాళ్ళ మొహాలు సుధకు ఇంకా పూర్తిగా అలవాటు కాలేదు. అంతా కొత్తగా, వింతగా అదేదో లోకంలో వున్నట్లుంది. అయినా వృత్తి పట్ల గౌరవంతో డ్యూటీని సిన్సియర్ గా చేస్తోంది.

సుధది హైదరాబాద్. ఇంట్లో తల్లిదండ్రులు, తమ్ముడు వుంటారు. తండ్రికి యాక్సిడెంట్ లో ఒక కాలు పోవడంతో ఇంటికే పరిమితమయ్యాడు. తమ్ముడి చదువు, ఇంటి ఖర్చులు అన్నింటికీ తన జీతమే ఆసరా. అందుకే సుధ ఈ ప్రవాస జీవితాన్ని ఎంచుకుంది.

నర్సుగా పనిచేయడం తన కల. కానీ కువైట్‌లో జీవితం తను ఊహించినంత సులభంగా లేదు. ముఖ్యంగా, రోగులతో సంభాషించడంలో భాష ఒక పెద్ద సమస్య. అరబిక్ కొంత అర్థం చేసుకున్నా, పూర్తి స్థాయిలో మాట్లాడలేకపోవడం తనను చాలా నిరాశపరిచేది. అంతేకాదు, అక్కడి స్థానిక నర్సులు కొంతమంది తనను చులకనగా చూడటం, చిన్న చిన్న పనులను తన నెత్తిన పడేయడం వంటివి మామూలయింది. ముఖ్యంగా సీనియర్ నర్సు ఫాతిమా, సుధపై పెత్తనం చలాయించడానికి ఏ చిన్న అవకాశం వచ్చినా వదిలిపెట్టేది కాదు. చాదస్తంతో టార్చర్ పెట్టేది.

ఇలాంటి స్త్రీలు భూమికి బరువు స్త్రీ జాతికి అవమానం అనిపించింది సుధకు.

అయినా మౌనంగా అన్నీ భరించేది.  ఉద్యోగం వదిలే ప్రసక్తి లేదు కాబట్టి ఎదురు తిరిగి ప్రశ్నించలేకపోయింది. అందులో కొత్త. పరదేశమిది. పని అలవాటయ్యేంత వరకు ఓర్చుకోక తప్పదు అని భావించేది సుధ.

ఒకరోజు, సుధ షిఫ్ట్ ముగిసింది. అల్–సబా హాస్పిటల్ నుండి బయటకు రాగానే, ఆకాశం మండుతున్న ఎండలో కరిగినట్లు అనిపించింది. రోడ్డు పక్కన ఖర్జూర చెట్లు గాలికి నెమ్మదిగా కదులుతున్నాయి. దూరంగా ఇసుక దిబ్బలు సముద్రంలా విస్తరించి ఉన్నాయి. తన రూమ్‌మేట్‌లు నిషా, జెస్సీ కూడా మలయాళీలు. ముగ్గురు కలిసి అల్–ఫర్వానియాలోని చిన్న అపార్ట్‌మెంట్‌లో ఉంటారు. రూమ్ చాలా చిన్నది, కానీ ముగ్గురు కలిసి నవ్వుతూ, మాట్లాడుకుంటూ తమ బాధలను మరచిపోయే ప్రయత్నం చేస్తారు.

ఇంటివద్ద ఎన్నో సమస్యలు. వాటిని పరిష్కరించడానికే కదా కువైట్ కు వచ్చారు.

ఆ రోజు రాత్రి భోజనం చేస్తూ, సుధ తన మనసులోని మాట చెప్పింది. "నేను ఇక్కడ ఇమడలేకపోతున్నాను. ఏదో ఒక రోజు వెనక్కి వెళ్ళిపోతానేమో అనిపిస్తోంది ఆ ఫాతిమా హింసను భరించలేకున్నాను" అంది. నిషా, జెస్సీ ఇద్దరూ తనని ఓదార్చారు.

"అలవాటవుతుంది సుధా, మనమందరం ఇలాగే వచ్చాం కదా! ఒక సంవత్సరం ఓపిక పడితే ఫాతిమా ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోతుంది. ఎవరూ ఇక్కడ శాశ్వతం కాదు కదా" అన్నారు.

సరే కొన్నిరోజులు చూద్దాం అనుకుంది సుధ. ఆ కొన్నిరోజులే ఆమె జీవితంలో అద్భుతాన్ని ఆవిష్కరించాయి. అదృష్టాన్ని తెచ్చిపెట్టాయి. గొప్పసంపదకు వారసురాలిని చేసాయి. రాజకుటుంబీకురాలి దయను పొందేట్లు చేసాయి.

ఎవరి కథ ఎప్పుడు ఎలా మలుపు తిరుగుతుందో ఎవరు చెప్పగలరు?

కొన్ని రోజుల తరువాత, సుధ వార్డులో ఒక వృద్ధురాలికి సేవలు అందించింది.  ఆ వృద్ధురాలు బాగా జబ్బుపడి ఉంది. ఆమె పేరు హమీదా. ఆమె ఒంటరిగా ఉంది, సహాయానికి ఎవరూ లేరు. హమీదాకు జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతోంది. సుధ ఆమెకు మందులు ఇచ్చి, జాగ్రత్తగా చూసుకుంది.

వచ్చీరాని భాషలో, కొద్దిగా ఇంగ్లీష్ ను కలిపి దయగా పలకరించేది. హమీదాకు కోలుకోవడానికి సమయం పట్టింది. దాదాపూ నెలరోజులు బెడ్ పై హాస్పిటల్.లో వుంది.

సుధ ప్రతి రోజూ ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేసేది. మెల్లగా హమీదాకు సుధపై నమ్మకం కుదిరింది. ఒక రోజు హమీదా తన జేబులోంచి ఒక చిన్న వెండి పెట్టెను తీసి సుధకు ఇచ్చింది. "నా దగ్గర ఏమీ లేదు అమ్మాయి, ఇది ఉంచుకో. నువ్వు నాకు చేసిన సేవకు ఇది చిన్న బహుమతి" అంది.

ఆ పెట్టెలో ఒక పురాతన నాణెం ఉంది.

సుధ మొదట వద్దన్నా, హమీదా బలవంతం చేయడంతో తీసుకుంది. "ఇది మా కుటుంబానికి చెందినది. దీనికి ఏదో ప్రత్యేకత ఉంది" అని హమీదా చెప్పింది.

ఆ తర్వాత రెండు రోజులకు హమీదా ఆరోగ్యం మరింత క్షీణించింది. వున్నట్టుండి ఆమె శరీరమంతా నీలంగా మారుతోంది. ఆసుపత్రిలో అలాంటి కేసు ఎప్పుడూ చూడలేదు సుధ. డాక్టర్లు కూడా అయోమయంలో పడ్డారు. అకస్మాత్తుగా, హమీదా తన పక్కనే ఉన్న సుధ చేయి పట్టుకుని బలహీనంగా "నీలి రంగు, విషం, నీటిలో" అని గొణిగింది.

సుధకు ఆ మాటలు అర్థం కాలేదు. వెంటనే డాక్టర్‌కు చెప్పింది. డాక్టర్లు హమీదా మాటలను పట్టించుకోలేదు,

ముసలామె మతిస్థిమితం కోల్పోతుందని భావించారు. కానీ సుధకు ఏదో అనుమానం వచ్చింది. తన మనసులో ఆ మాటలు మెదులుతూనే ఉన్నాయి.

ఆమె నీళ్ళు తాగిన గ్లాసు, మందుల సీసాలను పరిశీలించింది. ఏమీ దొరకలేదు. హమీదా ఆరోగ్యం ఇంకా క్షీణించడంతో ఆమెను ఐసియుకి తరలించారు.

రాత్రి డ్యూటీ ముగిసింది. సుధ ఇంటికి వెళ్ళింది. హమీదా ఇచ్చిన నాణెం తన చేతిలో ఉంది. పాత నాణెం అది. ఇది ఎందుకు పనికి వస్తుంది? బంగారం కూడా కాదేమో అనుకుంటూ పరిశీలించి చూసింది.

దానిపై అస్పష్టంగా చిన్న అక్షరాలతో అరబిక్ లో ఏదో చెక్కబడి ఉంది. రూమ్‌మేట్‌లు నిషా, జెస్సీని అడిగినా వాళ్ళకు దాని గురించి తెలియలేదు. "ఇది ఏదైనా పాతకాలపు నాణెం అయి ఉంటుంది సుధా. పెద్దగా పట్టించుకోకు" అంది నిషా.

కానీ సుధ మనసు అందుకు అంగీకరించలేదు. ముసలామె హమీదా మాటలు తనను వెంటాడుతున్నాయి. "నీలి రంగు... విషం... నీటిలో..." సుధకు అకస్మాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. హమీదా మందులు తాగడానికి ఉపయోగించిన వాటర్ బాటిల్. దాన్ని తను ఐసియుకి తరలించే ముందు చూసింది, కానీ పెద్దగా పట్టించుకోలేదు.

మరుసటి రోజు ఉదయం, సుధ డ్యూటీకి రాగానే నేరుగా ఐసియుకు వెళ్ళింది. హమీదా వాటర్ బాటిల్ ఏది, ఎక్కడుందని అడిగింది. నర్సులు ఎవరూ దాన్ని గుర్తించలేదు. సుధ తన శాయశక్తులా వెతికింది. చివరకు, ఒక చెత్తబుట్టలో ఆ వాటర్ బాటిల్ కనిపించింది. దాన్ని పరీక్షించగా, బాటిల్ లోపల భాగంలో సన్నని నీలి రంగు పొర కనిపించింది. సుధకు వెంటనే విషం అని అనుమానం వచ్చింది. ఆమె వెంటనే సీనియర్ డాక్టర్ మసూద్‌ను కలిసింది. డాక్టర్ మసూద్ మొదట సుధ మాటలను నమ్మలేదు. కానీ సుధ పట్టుదల చూసి, ఆ వాటర్ బాటిల్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపాడు.

పరీక్ష ఫలితాలు సుధను షాక్‌కు గురిచేశాయి. ఆ బాటిల్‌లో "థాలియం" అనే విషం ఉన్నట్లు తేలింది. అది చాలా నెమ్మదిగా పనిచేస్తుంది. హమీదా లక్షణాలు అన్నీ థాలియం విషం యొక్క లక్షణాలే. కానీ ఎవరు ఎందుకు హమీదాకు విషం ఇస్తారు?

సుధ ఆసుపత్రి సిబ్బందిపై అనుమానం పెంచుకుంది. హమీదాకు ఆసుపత్రిలో శత్రువులు ఎవరూ లేరు. ఆమె ఒంటరిగా ఉంది. అప్పుడు సుధకు హమీదా ఇచ్చిన నాణెం గుర్తుకొచ్చింది. ఆ నాణెంపై ఉన్న అస్పష్టమైన గుర్తును పరిశీలించింది. అది ఒక పురాతన కువైటీ కుటుంబానికి చెందిన చిహ్నంలా కనిపించింది. సుధ ఆ చిహ్నం గురించి ఆన్‌లైన్‌లో వెతికింది. అది కువైట్‌లోని అత్యంత ధనిక కుటుంబాలలో ఒక కుటుంబానికి చెందినది. ఆ కుటుంబానికి చెందిన ఆస్తికి హమీదా వారసురాలు అని తెలుస్తోంది. సుధకు తల తిరిగిపోయింది. హమీదాకు బంధువులు లేరని తను అనుకుంది. కానీ, హమీదా ఈ కుటుంబానికి వారసురాలు కావడం వెనుక ఏదో కుట్ర ఉందని సుధకు అర్థమైంది.

వెంటనే విషయాన్ని సీనియర్ డాక్టర్ మసూద్ కు తెలియజేసింది.

ఆయన పోలీసులకు ఫోన్ చేసారు.

పోలీసులు వచ్చి హమీదాను చూసి యా అల్లా ఈమె రాజరిక కుటుంబానికి చెందినది. ఈమెను అనాధలా వదిలేసారా? విష ప్రయోగం ఎవరు చేసారు? ఈమె ఆస్తి కోసం కుట్ర జరిగివుంటుంది అని చెబుతూ కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలోని సిసిటివి ఫుటేజీని క్షుణంగా పరిశీలించారు. చివరకు ఆ ఫుటేజ్ లో సీనియర్ నర్సు ఫాతిమా హమీదా వాటర్ బాటిల్‌లో ఏదో కలుపుతూ కనిపించింది. ఫాతిమాను విచారించగా, ఆమె హమీదా కుటుంబంలోని ఒక దూరపు బంధువుతో కలిసి ఈ కుట్ర పన్నినట్లు తేలింది. హమీదా ఆస్తిని కాజేయడానికి ఆమెను నెమ్మదిగా విషంతో చంపాలని ప్రయత్నించారు.

వెంటనే ఫాతిమాను అరెస్ట్ చేశారు. ప్రత్యేకమైన చికిత్సలు చేసి విలువైన మందులు ఉపయోగించి హమీదా ప్రాణాన్ని కాపాడగలిగారు.

ఈ సంఘటనతో సుధకు హాస్పిటల్‌లో మంచి పేరు వచ్చింది. డాక్టర్ మసూద్, ఇతర డాక్టర్లు అందరూ సుధను మెచ్చుకున్నారు.

తన నిస్వార్థ సేవ, పరిశీలనా శక్తి, మరియు సమయస్ఫూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా, హమీదా సుధకు కృతజ్ఞతగా తన ఆస్తిలో కొంత భాగాన్ని సుధకు రాసిచ్చింది. "నువ్వు నా ప్రాణం కాపాడావు అమ్మాయి. ఈ ఆస్తి నీకే చెందుతుంది," అంది. సుధ ఆ ఆస్తిని నిరాకరించింది.

"నాకు మీ జీవితం ముఖ్యం, ఆస్తి కాదు," అంది. కానీ హమీదా పట్టుబట్టడంతో, సుధ ఆ డబ్బుతో తన తమ్ముడి చదువుకు, ఇంటికి సహాయం చేసింది. స్వతహాగా దయాగుణం కలిగిన సుధ హైద్రాబాద్ లోని కొన్ని అనాధ శరణాలయాలకు కూడా తనవంతుగా ఫండ్స్ పంపించి మానవతను చాటుకుంది

ఈ సంఘటన తర్వాత సుధను 'సేవియర్ నర్స్' అని పిలవడం మొదలుపెట్టారు. ఆమెను కువైట్ ప్రభుత్వం గౌరవించింది. సుధకు నర్సు వృత్తి పట్ల గౌరవభావం పెరిగింది.

ఆమె పని పట్ల మరింత అంకితభావంతో పనిచేయడం మొదలుపెట్టింది. తన వృత్తిలోని సవాళ్లు ఆమెను మరింత బలమైన వ్యక్తిగా మార్చాయి. కువైట్‌లోని ఇసుక తిన్నెల్లో, అల్-సబా హాస్పిటల్ గోడల మధ్య సుధ తన నిజమైన గుర్తింపును, ప్రవాసంలో ఉన్నప్పటికీ తన విలువను కనుగొంది. ఆమె తన కలలను నిజం చేసుకుని, అనేకమందికి ఆదర్శంగా నిలిచింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments